క్లుప్తంగా

మద్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద సీఐ శ్రీనివాస్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనదారులు రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లవద్దన్నారు. అధిక మొత్తంలో బంగారం, మద్యాన్ని సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

మొక్కలకు నీరు అందించేవారు కరువు

మానవపాడు: హరితహారంలో నాటిన మొక్కలకు నీళ్లు పోసేవారు కరువయ్యారు. పట్టించుకోకపోవడంతో పల్లెప్రకృతివనం ఎండుతోంది. పల్లె ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం కోసం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతివనాల లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని అమరవాయిలో పల్లెప్రకృతివనం దర్శనమిస్తోంది. చాలా గ్రామాల్లో మొక్కలకు నీరు అందిచడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామ ప్రత్యేక అధికారులు పల్లెప్రకృతి వనాలపై దృష్టి పెట్టి వాటిని ప్రజలకు ఉపయోగపడేలా తయారు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల శివారులో బ్రిడ్జిపై రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తక్కశిల గ్రామ సమీపంలో ప్రాగటూరుకు చెందిన భీమేష్ ఉండవెల్లికి వస్తుండగా, మారమునగాలకు చెందిన వెంకట్రాముడు ఉండవెల్లి నుంచి తమ గ్రామానికి వెళ్తుండగా రెండు బైకులు ఎదురెదురు ఢీకొన్నాయి. భీమేష్‌కు కాలికి, చేయికి తీవ్ర గాయాలు కావడంతో 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. వెంకట్రాముడును ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

ధరూరు: హైదరాబాద్‌లో చదువుకోవడానికి వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మన్నాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్(20) తండ్రి తిమ్మప్ప ఎర్రవల్లి చౌరస్తా వద్ద కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీంతో శ్రీకాంత్ తల్లితో కలిసి గద్వాలలో నివాసం ఉంటూ పై చదువుల కోసం హైదరాబాద్ వెళ్లాడు. 15 రోజుల క్రితం కాలేజీకి వెళ్తున్న క్రమంలో హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో కాలు, చేయి విరిగి ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేసి కాలుకు రాడ్ వేశారు. పదిహేను రోజులుగా కోమాలో ఉన్న శ్రీకాంత్ గురువారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో మన్నాపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

భార్యాభర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడుకు చెందిన రైతు సంఘం సభ్యులు పాముల ఆంజనేయులు జమ్ములమ్మ ఆలయ స్థల విషయంలో విక్రమాచార్యులు, అతని భార్య జయలక్ష్మి కలిసి మాటమాట పెరిగి దూషించుకున్నారు. ఈ వివాదంలో భార్యాభర్తలిద్దరు తనను కులంపేరుతో దూషించారని ఈ నెల 24న పాముల ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. దీంతో భార్యాభర్తలపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తున్న కారు గుర్తు తెలియని లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మహిళకు గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. గురువారం హైదరాబాద్ నుంచి అనంతపురం జిల్లాకు కారులో భార్యాభర్తలు సౌజన్య, మనిదర్, ఇద్దరు పిల్లలు, ఒక మహిళ వెళ్తున్నారు. మనిదర్ డ్రైవింగ్ చేస్తూ గుర్తు తెలియని లారీని ఢీ కొట్టాడు. దీంతో కారు దెబ్బతినడంతో కారులో ఉన్న సౌజన్య తలకు బలమైన గాయాలయ్యాయి. మనిదర్‌కు స్వల్ప గాయాలు కావడంతో 108లో వారిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు. హైవే సిబ్బంది ట్రాఫిక్ జాం కాకుండా వాహనాలను అదుపు చేశారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన ఫక్రుద్దీన్ పెబ్బేరు పట్టణంలోని మెట్రో టెంట్‌హౌస్‌లో పనిచేస్తూ గత నెలలో బైక్ ప్రమాదంలో కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో ఆ కుటుంబానికి పెబ్బేరు పట్టణానికి చెందిన మైనార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రూ.14,500వేల ఆర్థికసాయం అతడి భార్యకు అందించారు. కార్యక్రమంలో జామే మజీద్ కమిటీ సభ్యులు ఎండీ అఫ్సర్, మజీద్, మొయినుద్దీన్, కుత్బుద్దీన్ పాల్గొన్నారు.

ఊరంతా ఒకటే బోరు


మారమునగాల-1 గ్రామ శివారులోని పంట పొలంలో ఉన్న బోరు

జల గోస

- మారమునగాల-1లో ప్రజల అవస్థలు
- అందని మిషన్ భగీరథ నీరు
- బోరు పాడైతే నీటి కష్టాలే..


మారమునగాల-1 గ్రామంలో మిషన్ భగీరథ నీటి ట్యాంకు

ఉండవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ నీరు కనీసం ఆ గ్రామానికి పైపులకు కూడా రాలేదు. ఉండవెల్లి మండలంలోని మారమునగాల నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన సమయంలో మారమునగాల-1, మారమునగాల-2 గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. మారమునగాల-2 గ్రామానికి నీరు చేరుతోంది కానీ, మారమునగాల-1కు మాత్రం అంతంత మాత్రమే. అన్ని ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసినా అందులో నీళ్లు రావడం లేదు. మిషన్ భగీరథ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా మిషన్ భగీరథ నీరు ప్రజలు తాగడం లేదని, సరఫరా చేసినా ఏమి ప్రయోజనమని మండల సమావేశాల్లో అధికారులు సమాధానం చెబుతున్నారు.

గ్రామానికి ఒక్కటే బోరు..


ట్యాంకర్ లో మోటార్ వేసి ట్యాంకుకు సరఫరా చేస్తున్న గ్రామస్తులు

మారమునగాల-1 లో 720 మంది జనాభా ఉన్నారు. వారికి మిషన్ భగీరథ నీటిని నింపేందుకు 60కేవీ మినీ ట్యాంకును నిర్మించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. కృష్ణానది పక్కన ఉన్న పొలాల మధ్యలో, గ్రామానికి కిలోమీటరు దూరంలో 50 ఏళ్ల క్రితం ఒక బోరును ఏర్పాటు చేశారు. ఆ బోరు నుంచి గ్రామ మధ్యలో ఉన్న మినీ ట్యాంకును నింపి, ఆ నీటిని మరో మోటార్ ద్వారా మిషన్ భగీరథ ట్యాంకుకు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి ఇంటింటి నల్లాలకు సరఫరా చేస్తారు. ఉన్న మోటర్ ఫేయిల్ అయితే ఎండకాలంలో ప్రజలకు నీటి కష్టాలు తీవ్రంగా ఉంటాయి. మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరఫరా చేస్తే కొంత నీటి ఇబ్బందులు తప్పుతాయని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్యాంకర్ నుంచి మోటర్ ద్వారా ట్యాంకుకు..

గ్రామ పంచాయతీలకు ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఆ ట్యాంకులో నీటిని తెచ్చి అందులో మోటర్‌ను ఏర్పాటు చేసి ట్యాంకును నింపుతారు. తర్వాత కుళాయిలకు వదులుతారు. ట్యాంకర్ నుంచి ట్యాంకుకు సరఫరా చేస్తున్న ఏకైక గ్రామంగా చెప్పుకోవచ్చు.

భగీరథ నీరు రుచే చూడలే..



గ్రామంలో నీటి కోసం తిప్పలు అధికమయ్యాయి. ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ నీరు వస్తోంది. మా గ్రామానికి మాత్రం ఆ నీరు రుచే తెలియదు. ఉన్న ఒక్క బోరుతోనే కాలం వెళ్లదీస్తున్నాం. ఎలాంటి అవసరాలకు ఉపయోగించుకోము. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– చెన్నమ్మ, మారమునగాల-1

మోటార్ చెడిపోతే ఏరే గతి..



గ్రామానికి మొత్తం ఒక్క బోరే పని చేస్తుంది. ఎక్కడ బోరు వేసిన నీరు పడడం లేదు. నది దగ్గర ఉన్న పరిస్థితి చాలా దారుణంగా ఉంది. నీరు అట్టడుగుకు చేరుతోంది. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. నేను వికలాంగుడిని, మా భార్య లక్ష్మీదేవి నీరు తెచ్చుకోలేదు. అధికారులు ఆలోచించాలి.

– నరసింహ, మారమునగాల-1

కుళాయిలో గంట మాత్రమే నీళ్లు వస్తాయి..



ఉదయం, సాయంత్రం సమయంలో మోటర్లు ఆన్ చేస్తే నీటి ట్యాంకు నుంచి కుళాయిలకు ఒక గంట మాత్రమే నీళ్లు వస్తాయి. కనీసం తాగడానికి కూడా నీరు రాని పరిస్థితి ఉంది. ఏ అధికారి పట్టించుకోలేదు. గ్రామ పెద్దలు ఆలోచనతో మినీ ట్యాంకుకు మరమ్మతులు చేస్తున్నాం. గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ను అక్కడ ఏర్పాటు చేసి అందులో మోటర్‌ను పెట్టి నీటిని సరఫరా చేస్తున్నాం. అధికారులు ఆలోచించాలి.

– బాలచంద్రుడు, మారమునగాల-1

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు


మానవపాడులో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

అయిజ: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బయాలజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించినట్లు డిపార్ట్ మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఠాగూర్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బ్రైట్ స్టార్, కృష్ణవేణి హైస్కూల్, మండలంలోని ఉత్తనూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మొత్తం 986 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 975 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు గురువారం ప్రశాంతంగా నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. సైన్స్ పరీక్షకు 284 మందికి గాను, 283 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది, ప్రైమరీ పాఠశాలలో 132 మంది విద్యార్థులకు గాను, 131 మంది హాజరైనట్లు తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో 150 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

టీకాలతో పశువులకు ఆరోగ్యం


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

గద్వాల వ్యవసాయం: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి శంకరయ్య అన్నారు. గురువారం గద్వాల పట్టణంలోని జమ్మిచేడు, చింతలపేట, బీసీ కాలనీ మండలంలోని బీరెల్లిలో పశువైద్య సిబ్బంది 39 మంది రైతులకు చెందిన 651 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మాధవీలత, తేజస్విని, కృష్ణయ్య, రాముడు, గోపాలమిత్రలు ప్రభాకర్, నర్సింహ, బుద్ధుడు, ఫణీంద్రరాజు పాల్గొన్నారు.

వ్యాధినిరోధక టీకాలు వేయించండి

అయిజ: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. గురువారం మండలంలోని పులికల్, కిషాన్ నగర్ గ్రామాల్లో మొత్తం 770 పశువులకు వెటర్నరీ సిబ్బంది టీకాలు వేశారు. వ్యాధి తీవ్రమైతే పశువులు చనిపోతాయని, వ్యాధి నిరోధక టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి


ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

అయిజ: పట్టణంలో పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణం పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. గురువారం పశువుల ఆస్పత్రి సమీపంలోని మూల మలుపువద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేసినా అది ఊరుబయట ఉండడంతో ప్రజలు ఆ రోడ్డుపై వెళ్లేందుకు విముఖత చూపుతున్నారు. పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ నుంచి కొత్త బస్టాండ్ వెళ్లే రోడ్డు చాలా ఇరుకుగా ఉండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ అవుతోంది. దాని వల్ల అత్యవసర పనులపై వెళ్లేవారు. ఆస్పత్రులకు వెళ్లేవారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు, చిన్న ఆటోలను మాత్రమే ఆరోడ్డు మార్గంనుంచి అనుమతించాలని, పెద్ద వాహనాలను ఊరి బయట ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రోడ్డుపై వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగదేవత ఆలయ పునఃప్రతిష్ఠ


ఆలయ పునః ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ

ధరూరు: మండల కేంద్రంలోని ఎరుకలి వీధి సమీపంలో నాగ దేవత ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అంతకుముందు గణపతి పూజ, నవగ్రహ పూజ, నాగ ప్రతిష్ఠ హోమం, పూర్ణావతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, కాంగ్రెస్ మండల నాయకులు బండ్ల వెంకటేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఓటు వేసిన ప్రజాప్రతినిధులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలానికి చెందిన 16మంది ప్రజాప్రతినిధులు గురువారం మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన జెడ్పీటీసీ సభ్యునితో పాటు 15మంది ఎంపీటీసీ సభ్యులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటును వేసినట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలో రేణుకను భర్త సురేష్, బావ రాజశేఖర్, తోటి కోడలు రేణుకలు అవమానపరుస్తూ, చిన్న మామ లక్ష్మణ్ తనపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని నలుగురుపై గురువారం ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద రూ.64,700 పట్టివేత

అలంపూర్: తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు చెక్‌పోస్టులో ఎలక్షన్ నిబంధనల ప్రకారం ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి కర్నూల్ పట్టణం ఎల్కూరు బంగ్లాకు చెందిన శివకుమార్ టీ తాగడానికి బైక్‌పై టోల్‌ప్లాజాలోని ప్రేమాదా టీ స్టాల్ వద్దకు వచ్చాడు. అతనిని పోలీసులు తనిఖీ చేయగా రూ.64,700 నగదు లభించింది. ఆ డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో చెక్‌పోస్టు అధికారులు నగదును తీసుకొని జిల్లా గ్రీవెంట్ సెల్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న టీఎస్ ఆయిల్‌ఫెడ్ టెక్నికల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి

ధరూరు: పామాయిల్ తోటల్లో రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని టీఎస్ ఆయిల్‌ఫెడ్ టెక్నికల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వలపాడు, కోతులగిద్ద, నీలహళ్లి తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. బయో డీ కంపోస్ట్‌తో పశువుల పెంటను కుల్లగొట్టి మెటరైజియం బయో కీటకనాశిని, బయో ఎన్‌పీకే కన్సార్టియా, వామ్, సీవీడ్‌లాంటి పశువుల పెంటతో కలిపి చెట్లకు 20కేజీలు వేయడం వలన కొమ్ము పురుగును సమర్థవంతంగా నివారించవచ్చని రైతులకు వివరించారు. అలాగే మైక్రో జెట్స్ నిర్వహణ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం కలుపు నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న ఎండలతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, రైతులు అప్రమత్తమై పంటలకు పూర్తి స్థాయిలో నీరందించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి వెంకటేష్, మండల ఫీల్డ్ ఆఫీసర్ శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డుకు మరమ్మతు చేపట్టాలి


గట్టు సమీపంలో మరమ్మతుల కోసం తారును తొలగించి వదిలేసిన అధికారులు

గట్టు: గట్టు, గొర్లఖాన్‌దొడ్డి, అయిజ వరకు ఉన్న తారు రోడ్డు దెబ్బతిని, వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గతంలో రోడ్డు మరమ్మతు కోసం గట్టు నుంచి గొర్లఖాన్‌దొడ్డి దారి మధ్యలో అక్కడక్కడా అధికారులు తారును తొలగించారు. ఆ తర్వాత ఇప్పటికి తారు తొలగించిన చోట మరమ్మతులు చేయడం మరిచి పోయారు. రోడ్డుపై తేలిన కంకర కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గట్టు, గొర్లఖాన్‌దొడ్డి, ఎక్లాస్‌పూర్, అయిజ వరకు తారు రోడ్డు వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు కనీస మరమ్మతులు చేయించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారినట్లు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గట్టు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో మాత్రమే సిమెంట్ రోడ్డు వేసి, మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్టు నుంచి నిత్యం అయిజకు ఇదే దారి రాకపోకలకు ఉపయోగిస్తారు. 15 కిలోమీటర్ల దారి మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడిన కారణంగా వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గట్టు, గొర్లఖాన్‌దొడ్డి, అయిజ రోడ్డుకు నిధులను కేటాయించి, మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సెగ్రిగేషన్ షెడ్ల వినియోగమేది?

కనపడని కంపోస్టు ఎరువు తయారీ

- షెడ్లలో చెత్త రీసైక్లింగ్ ఊసేలేదు
- ప్రతి జీపీలో రూ. 2.5లక్షలతో నిర్మాణం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు


షేకుపల్లిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు


పెద్దదిన్నెలో తయారైన నాణ్యత లేని ఎరువు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలను స్వచ్ఛగ్రామాలుగా మార్చేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పంట పొలాలకు అవసరమయ్యే కంపోస్ట్ ఎరువులను తయారీ చేయడం కోసం ప్రభుత్వం ప్రతి జీపీలో షెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ కొందరి అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో అమలు కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని గ్రామ శివారులో, రోడ్ల పక్కన ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. దీనివల్ల పంచాయతీల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టినా అవి ప్రజలకు సక్రమంగా ఉపయోగపడటం లేదని పలువురు పేర్కొంటున్నారు.

నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

తెలంగాణ ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పంచాయతీకి రూ.2.5 లక్షల నిధులు కేటాయించింది. ప్రతి జీపీల్లో సెగ్రిగేషన్ సెడ్‌ను నిర్మించి గ్రామం నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించింది. ఎరువు తయారీ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. దీనివల్ల ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నీరుగారుతోంది.

నాణ్యతలేని కంపోస్టు ఎరువు..

పల్లెల అభివృద్ధిలో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్‌యార్డుల నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో చేపట్టారు. ఇందులో ఒక్కో సెగ్రిగేషన్ షెడ్‌కు ప్రభుత్వం రూ. 2.5 లక్షలను కేటాయించి పనులను పూర్తి చేయించింది. నియోజకవర్గంలోని 124 జీపీలకు గాను కేవలం 88 షెడ్లలో మాత్రమే కంపోస్టు ఎరువును తయారుచేస్తున్నారు. వీటిలో కూడా ఎరువు సక్రమంగా తయారు కావడం లేదని రైతులు వాపోతున్నారు. మిగిలిన 36 షెడ్లలో కూడా ఇప్పటి వరకు వానపాములు అందుబాటులోకి రాలేదు. దీనివల్ల కంపోస్టు ఎరువును తయారు చేసే ఊసే లేదు.

ఆయా మండలాల వారీగా వివరాలు..

మండలం	జీపీలు	ఉపయోగంలో ఉన్నవి	ని.వి
ఇటిక్యాల	29	21	08
మానవపాడు	16	12	04
అలంపూర్	14	09	05
ఉండవెల్లి	16	13	03
రాజోళి	11	08	03
వడ్డేపల్లి	10	06	04
అయిజ	28	19	09


ని.వి : నిరుపయోగమైనవి

వంద శాతం పనులు పూర్తి..



ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం పనులు వంత శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం 21జీపీల్లో వానపాములను ఉపయోగించి తడి, పొడి చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. మిగిలిన 8 పంచాయతీలకు వానపాములు అందుబాటులో లేనందున ఎరువుల తయారీని చేపట్టలేదు. షెడ్లలో తయారు చేసిన కంపోస్టు ఎరువును గ్రామాల్లోని రైతులకు విక్రయించి నిధులను పంచాయతీలకు సమకూరుస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల


జింకలపల్లి షెడ్‌లో నిరుపయోగంగా ఉన్న చెత్త, సీసాలు.